తుది దశకు వంతెనల నిర్మాణం

- ఖిల్లాఘనపురం, మామిడిమాడ సమీపంలో రూ.4.70 కోట్లతో నిర్మాణం
- తీరనున్న రాకపోకల సమస్య



ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి

ఖిల్లాఘనపురం: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఖిల్లాఘనపురం, మామిడిమాడ సమీపంలో ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులపై నుంచి పెద్దఎత్తున వర్షపు నీరు పారడంతో వాహణదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు ప్రభుత్వం 2023లో నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం రెండు వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు పూర్తి చేస్తే ఇక నుంచి వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తవు. వర్షాకాలం కావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు.

నిధులు మంజూరు..

ఖిల్లాఘనపురం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.50 కోట్లు, మామిడిమాడ శివారులో సల్కెలాపురం, వెల్కిచెర్ల వెళ్లే రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.20 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు నెలలుగా పనులను చేపడుతున్నారు.

తీరనున్న ఇక్కట్లు..

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గణపసముద్రం పాటుకాల్వపై గతం లో నిర్మించిన కల్వర్టు వద్ద ప్రతి సంవత్సరం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పెద్ద వాగు పారిందంటే చాలు పాటు కాల్వకు పెద్ద ఎత్తున నీరు వస్తుంది. ఈ సమయంలో కల్వర్టుపై నుంచి పారడమే కాకుండా తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లోకి వరదలా వెళ్లేవి. మామిడిమాడ వద్ద ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. అక్కడ నిర్మిచే బ్రిడ్జి నిర్మాణం కొంత ఆలస్యం అయినా పూర్తి చేయడం వలన శాశ్వత పరిష్కారం లభించనుంది.



ఖిల్లాఘనపురం తహసీల్దార్ కార్యాయలం వద్ద స్లాబ్ లెవల్‌లో ఉన్న బ్రిడ్జి

రెండు నెలల్లో పూర్తి

మామిడిమాడ, ఖిల్లాఘనపురం సమీపంలో ఉన్నత పాత కల్వర్టులను తొలగించి కొత్తగా రెండు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలుకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించడం జరిగింది. ఖిల్లాఘనపురం వద్ద ఉన్న బ్రిడ్జి నెల రోజుల్లో పూర్తి అవుతుంది. మామిడిమాడ వద్ద ఉన్న బ్రిడ్జిని మరో రెండు నెలల్లో పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– రాకేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ

త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలి

కొత్తకోట రూరల్: ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రభోద సేవాసమితి సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో దండుగడ్డవీధి, హైస్కూల్ ఏరియాలో త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి కాలనీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో మహేశ్వరి, పద్మ, వేణు, భాస్కర్‌రెడ్డి, రాములు, రవి, శివ జహంగీర్, పురుషోత్తం, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న ప్రభోద సేవాసమితి సభ్యులు

'ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం'



కనిమెట్టలో చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పార్టీ కోసం పనిచేసిన, సభ్యత్వం కలిగి ఉండి ప్రమాదాల్లో చనిపోయిన ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త, కుటుంబానికి అండగా ఉంటామని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనిమెట్టకు చెందిన బోయ భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అదేవిధంగా అమడబాకుల చెందిన శ్యాంసుందర్‌రెడ్డి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. బోయభాస్కర్, శ్యామ్ సుందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ఉండటంతో బీఆర్‌ఎస్ చేసిన ఇన్సూరెన్స్ ద్వారా ఇద్దరికి వేర్వేరుగా రూ.2లక్షల చెక్కులు మంజూరయ్యాయి. చెక్కులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కనిమెట్ట, అమడబాకులకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, ప్రశాంత్, విశ్వేశ్వర్, మల్లేష్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీకాలనీలో ప్రభుత్వ పాఠశాల భవనం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాతభవనాన్ని కూలివేసి బేస్‌మెంట్ వరకు పనులు చేసి వదిలేశారు. ఏడాది దాటినా పనులు ముందుకు సాగకపోవడంతో చిన్న గదుల్లోనే విద్యాబోధనలు ఇబ్బందికరంగా మారాయి. ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు స్పందించి అదనపు తరగతిగదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఎస్సీకాలనీలో పాఠశాల భవనం

సాగని రహదారి పనులు



అమరచింత నుంచి మూలమళ్ల వెళ్లే రహదారి

- 4 కిలోమీటర్ల రహదారికి రూ.3.50 కోట్లు
- కచ్చ రహదారితో అమరచింత – మూలమళ్ల రైతుల ఇక్కట్లు

అమరచింత: ఐదేళ్ల కిందట అమరచింత–మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారికి బీటీ కోసం నిధులు మంజూరైన ఇప్పటికి పనులు మాత్రం ముందుకు సాగలేకపోతున్నాయి. నాలుగు కిలోమీటర్ల మేరకు బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.50కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులను చేపట్టకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు, రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పండించిన వరిధాన్యం మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై వెళ్లలేని పరిస్థితి దాపరించాయి. అమరచింత పట్టణం నుంచి మూలమళ్లకు వెళ్తున్న ఈ రహదారిపై జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న వాహనాలు, పర్యాటకులు సైతం ఇదే రహదారిపై ప్రయాణం చేస్తుంటారని, బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినప్పటికి పనులలో కదలికలు లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం..

బీటీ రహదారి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు అందించాం. సుమారు ఐదేళ్ల కాలం దాటుతున్న పనులు చేయకపోవడంకేమిటని ఇలా పనులు చేపట్టకపోతే బ్లాక్ లీస్ట్‌లో ఉంచుతామని హెచ్చరించాం. త్వరగా పనులు పూర్తి చేసి ఇరుగ్రామాల ప్రజలు, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, జేఈ పీజేపీ నందిమళ్ల డివిజన్

బాధిత కుటుంబానికి పరామర్శ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల చెందిన కాశీనాథ్ ఇటీవల మృతి చెందగా, ఆదివారం వారి కుటుంబ సభ్యులను కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. సంగినేనిపల్లి బీఆర్‌ఎస్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి తల్లి అలివేలమ్మ ప్రమాదవశాత్తు గాయపడడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యనారాయణగౌడ్, రఘునాథ్‌రెడ్డి, సర్ధార్, నర్సింహారెడ్డి, బిచ్చిరెడ్డి తదితరులువున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం

ఎల్‌ఓసీ అందజేత

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపూర్ చెందిన నాగేంద్రమ్మ హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతుంది. ఈమెకు రూ.1.10లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. దీన్ని ఆదివారం హైదరాబాద్‌లో కుమారుడికి అందజేశారు.

నేటి నుంచి నారాయణ స్వామి ఉత్సవాలు

రాజోళి: మండల కేంద్రంలో వెలిసిన శ్రీ వైకుంఠ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17 తేదీన అంకురార్పన, స్నపనం సేవ, పంచామృతాభిషేకంతో మొదలై ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ కల్యాణోత్సవం, 22న రథోత్సవం నిర్వహించనున్నట్లు నేటి నుంచి ఆలయ కమిటీ, భక్త బృందంతో విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది.

25న దుకాణాల అద్దెకు బహిరంగ వేలం

నారాయణపేట: కలెక్టర్, జిల్లా స్పోర్ట్స్‌చైర్మన్ ఆదేశానుసారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మక్తల్ మినీ స్టేడియంలోని ఆరు దుకాణాలను అద్దెకిచ్చేందుకు ఈ నెల 25న బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శెట్టి వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణ సముదాయలను అద్దెకు కావాల్సిన వారు రూ. 5వేలు డీవైఎస్ఓ నారాయణపేట గారి పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ తీసి రసీదును ఈ నెల 22 వరకు డీవైఎస్ ఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఎమైనా సందేహాలు ఉంటే 9490409900 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పోటెత్తిన భక్తులు



కొల్లాపూర్: పట్టణంలోని జమ్ములమ్మ గుడికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కోళ్లు, పొట్టేళ్ల బలిఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయ విశిష్టతను మేనుగొండ వంశానికి చెందిన ఆలయ పూజారులు భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

అనర్హులకు లేబర్ కార్డులివ్వొద్దు

ధరూరు: కార్మిక విభాగంలో పని చేసే వారికి కాకుండా అనర్హులకు లేబర్ కార్డులివ్వొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జనరల్ బాడీ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పని చేయని వారికి కూడా కొందరు దళారులు లేబర్ కార్డులు ఇప్పిస్తున్నారన్నారు. జిల్లాలో మొత్తం 30వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉంటే 50వేల లేబర్ కార్డులు జారీ అయ్యాయన్నారు. లేబర్ కార్డు ద్వారా పొందే లబ్ధిని ఇతరులు పొందే అవకాశాలున్నాయని, సంబంధిత శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. పని ప్రదేశాల్లో చోటు చేసుకునే ప్రమాదాల ద్వారా పొందే లబ్ధిని ఇతరులు పొందే అవకాశం ఉందని తెలిపారు. లేబర్ కార్డు జారీ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. పక్కదారి పట్టకుండా ఉండేందుకు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు నర్సింహులు, తిమ్మప్ప, ప్రవీణ్, ఆంజనేయులు, గోవిందు, మోష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ

భక్తులకు తప్పని తిప్పలు



పెద్దకొత్తపల్లిలో నిలిచిపోయిన వాహనాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లే వాహనాలతో పెద్దకొత్తపల్లి బస్టాండ్ కూడలీలో రద్దీ కనిపించింది. దీంతో ట్రాఫిక్ జాం అయ్యింది. గంటల తరబడి రోడ్లపైనే వాహనాలు నిలిపివేశారు. ఆదివారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. మృగశిర కార్తీ చివరి వారం కావడంతో తెల్లవారుజామున 5 గంటల నుంచే ప్రైవేటు వాహనాలు తరలివెళ్లారు. భక్తులు బస్టాండ్ కూడలిలో వాహనాలు నిలిపి భక్తులు, కోళ్ల, కొబ్బరికాయలు, పూలు, కిరాణం సామానులు కొనుగోలు చేసేందుకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు వాహనదారులు కూడ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో వాహనాలు నిలుపుకొని వేచిఉండే పరిస్థితి దాపురించింది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే నాగర్‌కర్నూల్ వచ్చే మైసమ్మ దగ్గరకు వెళ్లే వాహనాలను ముష్టిపల్లి స్టేజీ వద్ద పోలీసులను ఏర్పాటు చేసి ముష్టిపల్లి, మత్రికల్, పెద్దకార్వాముట మీదుగా నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు వాహనాలను మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. కొల్లాపూర్ నుంచి వచ్చే ప్రైవేటు ఆర్టీసీ బస్సులను సాతాపూర్ గ్రామం మీదుగా మారేడుమాన్‌దిన్నె క్రాస్‌రోడ్డు యాపట్ల, జగన్నాథపూర్, చిన్నకొత్తపల్లి మీదుగా మైసమ్మ జాతరకు వాహనాలు పంపిసస్తే పెద్దకొత్తపల్లిలో ట్రాఫిక్ సమస్య ఉండదు. అధికారులు భక్తులకు ఇబ్బందలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొక్కలు నాటారు.. చెట్లు నరికారు

మానవపాడు: పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలను పెంచుతున్నారు. హరితహారంలో భాగంగా మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటుతున్నారు. అవి ఏపుగా పెరిగిన వెంటనే విద్యుత్ తీగలకు తగులుతున్నాయని నరికేస్తున్నారు. ముందస్తు ప్రణాళికలు లేకుండా అధికారులు ఎక్కడపడితే అక్కడ చెట్లను నాటి నరికేన్నారు. చెట్లను ఎందుకు వెయాలి.. ఎందుకు నరకాలి అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



క్లుప్తంగా

ఇంగ్లిష్, హిందీ పుస్తకాల కొరత

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన పాఠ్యపుస్తకాలల్లో ఇంగ్లిష్, హిందీ పుస్తకాలు మినహా మిగతా అన్ని వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి మొత్తం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు కలిపి 35వేలకు గాను 6వ తరగతి ఇంగ్లిష్, 9, 10వ తరగతి హిందీ పుస్తకాలు మినహా మిగతా అన్ని పుస్తకాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వచ్చిన పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. ఆయా పుస్తకాలు వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

బస్సులు నడపండి

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లికి బీటీ రోడ్డు ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులను రెగ్యులర్‌గా నడపడంలేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి గ్రామం 13.5 కి.మీ.దూరంలో ఉంది. మండల కేంద్రానికి వెళ్లాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో పాటు ఈ గ్రామానికి చెందిన చాలా మంది వ్యాపార నిమిత్తం ఎక్కువగా పెబ్బేర్‌కు వెళ్తుంటారు. రెగ్యూలర్‌గా బస్సు నడపాలని ఇటూ ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

కోతకు గురైన రోడ్డు



పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో, తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓ కార్యాలయాలు, పీహెచ్‌సీకి వెళ్లే ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లే అధికారులు, వివిధ గ్రామాల జనం ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు ఉన్న విషయం దగ్గరికి వచ్చే వరకు తెలియక వాహనదారులు కిందపడుతున్నారు. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



పెబ్బేరు రూరల్: బక్రీద్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఆధ్వర్యంలో 50 మంది పేద మహిళలకు చీరలు, బక్రీద్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో మాసూమ్‌పీర్, జకీర్, ఆమేర్, సమీర్, మునీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం రాయితీని సద్వినియోగం చేసుకోండి

వీపనగండ్ల: మండలంలోని రైతులు ఆయిల్‌పాం పంటను సాగు చేసి ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానవన శాఖ అధికారి కృష్ణ రైతులకు కోరారు. పంట సాగు చేసిన రైతులకు 90 శాతం రాయితీతో పాటు ఇతర డ్రిప్ పరికరాలు, అంతర పంటల సాగు కోసం ఎకరాకు రూ.4,200 నాలుగు సంవత్సరాలపాటు ఇస్తున్నట్లు తెలిపారు. పంట సాగుతో 25 నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి అందుతుందని, ప్రభుత్వమే నిర్దేశించిన ధరకు ఆయిల్‌పాం ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని నీటి వసతి ఉన్న రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

'నీట్'లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన జొల్లు అఖిల్ ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాలలో 645 మార్కులు సాధించాడు. పలువురు పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు ఆయనను సన్మానించి పేద విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీరయ్యయాదవ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



అమరచింత: మండలంలోని కిష్టంపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ లైట్లు కొన్ని నెలలుగా వరిగిపోతు కిందపడుతున్న వాటిని తొలగించడంలో విఫలమవుతున్నారు. రాత్రి వేళలో వెలుతురు ఉండేలా లైట్లను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గాంధీచౌక్‌లో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు



అమరచింత వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

గుంతల రోడ్లతో ఇబ్బందులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలోని వీధుల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. పది వార్డుల్లో పరిస్థితి ఇలాగే ఉండడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపునీరు భారీగా చేరడంతో వాహనదారులు నీళ్లలో పడిపోతున్నారు. సీసీ రోడ్ల పనులు పూర్తికాకపోవడం, గాంధీచౌక్‌లో డ్రైయినేజీ వద్ద కల్వర్టు నిర్మించక పోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయి. గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మట్టి రోడ్డు →



బస్టాండ్ వద్ద అధ్వానంగా మారిన రోడ్డు